## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



దుర్గారావు కుటుంబ సభ్యులకు ఆర్థిక వితరణ చేస్తున్న సంఘం సభ్యులు

**ఉప్పలగుప్తం:** మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రుకు చెందిన కండేపల్లి దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతని భార్యలక్ష్మికి వాడపర్రు నవోదయ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.11,000 ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, చప్పిడి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనువాసరావు, కడలి సాయిబాబు, మట్టపర్తి సుధీర్ పాల్గొన్నారు.

### వైభవంగా గిరి గోవర్ధన పూజ



గిరి గోవర్ధన పూజను నిర్వహిస్తున్న మహిళలు

**అమలాపురం టౌన్:** స్థానిక కూచిమంచి అగ్రహారంలో ఇస్కాన్ అమలారం శాఖ ఆధ్వర్యంలో శ్రీగిరి గోవర్ధన పూజ, దామోదర హారతి, కృష్ణ లీలలపై ప్రవచనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆదివారం వైభవంగా జరిగాయి. అమలాపురం ఇస్కాన్ సెంటర్ ఇన్‌చార్జి శివానంద నమయిదాస్ ప్రవచనాలు చెప్పారు. పూజా క్రతువుల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీకృష్ణుడిపై ఇస్కాన్ బృందం ఆలపించిన గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

### అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత

**ముమ్మిడివరం:** మండలంలోని గేదెల్లంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు కోన మాచరయ్య, కోన ఏసు ప్రసాద్‌లకు రెడ్ క్రాస్ ఆదివారం సాయం అందజేసింది. ఎంపీపీ కోలా భవాని, రెడ్ క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ, వైస్ చైర్మన్ పిన్నంరాజు వెంకటపతిరాజు, పెయ్యల చిట్టిబాబు, జంపన శ్రీనురాజు, సానబోయిన పల్లయ్య తదితరుల చేతుల మీదుగా వంట సామగ్రి, టార్పాలిన్, హైజనిక్ కిట్లు, బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు.

# అన్నదాతకు అండగా కొనుగోలు కేంద్రాలు

- ఏడు మండలాల్లో 108 ఆర్‌బీకేల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు
- రైతులకు ఇబ్బంది లేకుండా అధికారుల చర్యలు

**ఉప్పలగుప్తం:** ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుకు కనీస మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరిస్తున్న విషయం తెలిసిందే. గతేడాది రబీ వరి కోతల సమయంలో వర్షాలు అధికంగా పడి పనలపై తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సేకరించి దళారుల దోపిడీకి చెక్ పెట్టింది. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా మద్దతు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు ధాన్యం విక్రయించే ముందు స్థానిక కొనుగోలు కేంద్రం వద్ద సమాచారం అందించి ధాన్యం నాణ్యతను పరీక్షించుకుని అమ్మకానికి సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. వీటికి సంబంధించి ఇప్పటికే ప్రతీ ఆర్బీకేలో సంచులను నిల్వ ఉంచారు. ప్రతీ రైతుకు అందుబాటులో ఉండేలా అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం, తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల్లో 108 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశారు. వాటిలో సుమారుగా 1.35 లక్షల సంచులను అందుబాటులో ఉంచారు. ధాన్యం నాణ్యతను బట్టి సాధారణ రకానికి క్వింటాకు రూ.2,183, గ్రేడ్ 'ఏ' రకానికి రూ.2,203 చొప్పున ప్రభుత్వం రైతుకు మద్దతు ధర ప్రకటించింది. ప్రతీ రైతుకు ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో తమ ఖాతాలలోకి నగదు జమవుతుంది. హమాలీలు, ధాన్యం రవాణాకు వాహనాల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి కొనుగోళ్లు నిర్వహించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విలసవిల్లి రైతు భరోసా కేంద్రం

**మండలాలవారీగా కొనుగోలు కేంద్రాల వివరాలు**

| మండలం | కొనుగోలు కేంద్రాలు | వరిసాగు (ఎకరాల్లో) | నిల్వ ఉంచిన సంచులు |
|---|---|---|---|
| అమలాపురం | 23 | 4,881 | 10,500 |
| ఉప్పలగుప్తం | 14 | 5,134 | 31,000 |
| అల్లవరం | 18 | 3,124 | 30,000 |
| ముమ్మిడివరం | 14 | 5,215 | 20,000 |
| ఐ.పోలవరం | 13 | 7,271 | 19,000 |
| తాళ్లరేవు | 11 | 7,830 | 16,000 |
| కాట్రేనికోన | 15 | 4,456 | 9,000 |



ఉప్పలగుప్తం ఆర్బీకేలో నిల్వ ఉంచిన సంచులు

**దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట**



గత రబీలో తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేసింది. ప్రభుత్వం ఆదుకోకపోయుంటే దళారీల బారిన పడాల్సి వచ్చేది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి మిల్లర్ల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేయడం మంచి నిర్ణయం. అడుగడుగునా దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేస్తూ అన్నదాతలకు మేలు జరిగేలా చూస్తుండడం ఆనందదాయకం.

– గుర్లింక తమ్మేశ్వరరావు, రైతు, నంగవరం, ఉప్పలగుప్తం మండలం

**ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు**



ఆర్బీకేల ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. తేమ శాతం 17 మించకుండా రైతులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ప్రతీ ఆర్బీకేకూ సంచులను సమకూర్చాం. రవాణాకు సంబంధించి వాహనాలను ముందస్తుగా నమోదు చేసుకుంటే వారికి సమయానుకూలంగా నగదు జమ అవుతుంది.

– జి.కుమార్‌బాబు, వ్యవసాయాధికారి, ఉప్పలగుప్తం మండలం

## హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది

**ఐ.పోలవరం:** హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత హిందువులందరిపై ఉందని ముక్కామల పూజ్యశ్రీ శ్రీధర్ స్వామిజీ అన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దేవస్థానం, సమరసత సేవా సంయుక్త ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళన, హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం ఆలయ ఆవరణలో ఆదివారం జరిగింది. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, సర్పంచ్ కాశే రాజుబాబు, సమరసత సభ్యులు తొలుత దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామీజీ తన ఆధ్యాత్మిక ప్రవచనంలో మాట్లాడుతూ ప్రతీఒక్కరూ హిందూ ధర్మాన్ని రక్షించడానికి కట్టుబడి ఉండాలన్నారు. 2024 జనవరి 22న అయోధ్యలో జరిగే శ్రీరామ పట్టాభిషేకం రోజున అందరూ రామనామ జపం చేయాలని చెప్పారు. హిందూ ధర్మంలో ప్రతీ కష్టానికి ఒక మంత్రం, తంత్రం ఉన్నాయని వాటిని తెలుసుకోవాలన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక ప్రవచనం ఇస్తున్న శ్రీధర్ స్వామీజీ

## మత్స్యకార దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

**తాళ్లరేవు:** ఈ నెల 21వ తేదీన కోరంగిలో నిర్వహించే ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని జయప్రదం చేయాలని టీటీడీ పాలకమండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు. ఆదివారం ఆయన కోరంగి వంతెన సమీపంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ విలేకర్లతో మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజవకర్గంలో ఓఎన్‌జీసీ సంస్థ వేస్తున్న పైపులైన్ కారణంగా నష్టపోతున్న మత్స్యకారులకు నష్ట పరిహారం నాలుగో విడత పంపిణీ జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పరిహారాన్ని అందజేస్తున్నామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు మోపిదేవి వెంకటరమణ, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, అమలాపురం ఎంపీ చింతా అనూరాధ, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, స్థానిక సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఎంపీటీసీ సభ్యులు పోతుల రత్నకుమారి, పాలెపు పోసియ్య, కాటంశెట్టి రామ్మూర్తి, రేవు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కోరంగిలో ఏర్పాట్లపై నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

## ఐ హేట్ లవ్ చిత్ర టైటిల్ ఆవిష్కరణ

**అమలాపురం టౌన్:** పూర్తి గ్రామీణ వాతావరణంలో తెరకెక్కిన 'ఐ హేట్ లవ్' సినిమా టైటిల్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో ఆదివారం ఉదయం జరిగింది. అయినవిల్లి మండలం నేదునూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ డాక్టర్ రావి బాల ఈ చిత్రాన్ని నిర్మించారు. గ్రామీణ భావోద్వేగాలు, ఆప్యాయతలు, సంస్కృతీ సంప్రదాయాలు, సున్నితమైన హాస్యం, ప్రేమ మిళితంతో ఈ సినిమా రూపొందించామని దర్శకుడు వెంకటేష్ తెలిపారు. సినిమాలో హీరోయిన్‌గా శ్రీవల్లి నటించిందన్నారు. కార్యక్రమంలో హీరో సుబ్బు, కో ప్రొడ్యూసర్ పాలగుమ్మి వెంకటకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అంగర శివ సాయి గౌడ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లవిల్లి విద్యార్థులు

**ఉప్పలగుప్తం:** మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కంకిపాటి వెన్నెల, 9వ తరగతి చదువుతున్న మందా సంజన, 8వ తరగతి చదువుతున్న ఉప్పలపాటి రాజేష్, పాలకొల్లు హనీలు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల పీడీ గొలకోటి ఫణీంద్ర ఆదివారం తెలిపారు. రాజేష్, హనీ, వెన్నెల నంద్యాల జిల్లా నందికొట్కూరులో జరిగే బేస్‌బాల్ పోటీల్లో, సంజన విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో జరిగే ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.రాణి, పీడీ డి.సరస్వతి, పీఈటీ వి.విజయభాస్కర్ అభినందించారు.



మందా సంజన



కంకిపాటి వెన్నెల



ఉప్పలపాటి రాజేష్



పాలకొల్లు హనీ

### యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అల్లవరం:** స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో జీఎస్ ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల సమావేశంలో యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా కాకిలేటి సురేష్, ప్రధాన కార్యదర్శిగా కుడుపూడి ఎస్‌వీ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా అప్పారి త్రిమూర్తులు, కోశాధికారిగా ఎం.సుభాష్, సహాధ్యక్షులుగా ఎస్.సత్యనారాయణ, నాగలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంటీవీఏఎస్ సుబ్బారావు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

### రైతులకు అవగాహన కల్పించాలి

**యానాం:** నియోజకవర్గ పరిధిలో ఆక్వాసాగు చేస్తున్న రైతులకు అవగాహన కల్పించి సాగులో సహాయపడాలని మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్యకు యానాం ఆక్వా అండ్ ఫిష్ ఫార్మర్స్ అసోషియేషన్ సభ్యులు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. రొయ్యలు, చేపల పెంపకం చేస్తున్న రైతులకు ప్రభుత్వం ద్వారా రాయితీలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండమూరి భాస్కరరావు, అనిశెట్టి నాగిరెడ్డి, మెల్లం శ్రీనివాసరావు, కవల వీరభద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

### కార్తిక దీపోత్సవం

**తాళ్లరేవు:** మండలంలోని పి.మల్లవరంలో శ్రీదేవీ భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం కార్తిక దీపోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీరంగాచార్యులు, శ్రీనివాసాచార్యులుచే స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు కార్తిక దీపాలను వెలిగించి పూజలు చేశారు. స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



కార్తిక దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

### అనాథ శవానికి అంతిమ సంస్కారాలు

**అమలాపురం టౌన్:** స్థానిక చిన్న వంతెన వద్ద గత కొంత కాలంగా యాచకం చేసుకుంటూ అక్కడే రోడ్డు పక్కన ఒంటరిగా జీవిస్తున్న 80 ఏళ్ల అనాథ వృద్ధుడు శనివారం రాత్రి కన్నుమూశాడు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు దొంగ చిన్నా స్పందించి మున్సిపాలిటీకి సమాచారం అందించారు. ఆదివారం శవాన్ని మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో స్థానిక శ్మశాన వాటిక వద్దకు ట్రాక్టర్‌పై తీసుకెళ్లి ఖననం చేసి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు చిన్నా, మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బందిని పట్టణ ప్రజలు అభినందించారు.

### గ్రంథాలయాలు విజ్ఞాన దర్పణాలు

**ఐ.పోలవరం:** మానవ సర్వతోముఖాభివృద్ధికి గంథ్రాలయాలు విజ్ఞాన దర్పణాలుగా నిలుస్తాయని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో గంథ్రాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడు రోజుల పాటు పుస్తక ప్రదర్శన, చిత్ర ప్రదర్శన, వివిధ సాహితీ కార్యక్రమాలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ నాగలక్ష్మి, ఏఎస్ఎన్ మూర్తి, వీధి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### హైమాస్ట్ లైట్లు వెలగక ప్రమాదాలు

**తాళ్లరేవు:** మండల పరిధిలో అత్యంత రద్దీగా ఉండే సుంకరపాలెం జంక్షన్‌లో ఉన్న హైమాస్ట్ లైట్లు వెలగక రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు అన్నారు. అమలాపురం, కాకినాడ, యానాం, ద్రాక్షారామల నుంచి అనేకమంది ప్రయాణించే ఈ జంక్షన్‌లో లైట్లు వెలిగేలా హైవే అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

## పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలి

**అల్లవరం:** కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్ నిమిత్తం అమలాపురం నుంచి తోట్లపాలెం మీదుగా మొదట్లో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌నే కొనసాగించాలని కోరుతూ ఎంపీ అనురాధని బోడసకుర్రుపాలేనికి చెందిన మహిళలు వినతిపత్రం అందజేశారు. ఆదివారం బోడసకుర్రులోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ అనురాధను స్థానిక మహిళలు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కొత్తగా ప్రతిపాదించిన అలైన్‌మెంట్ అమలుచేస్తే తమ గ్రామంలో సుమారు 35 ఇళ్లు తొలగించాల్సి రావడంతో పాటు 44.5 ఎకరాల భూమిని రైతులు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే భట్నవిల్లి నుంచి పేరూరు మీదుగా తోట్లపాలెం వరకూ ప్రతిపాదించిన పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యాంప్రకాష్, చెల్లుబోయిన రమేష్, గుత్తుల రాజు, అంబటి శ్రీను, దొమ్మేటి శివస్వామి, అడపా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ అనురాధకి వినతిపత్రం ఇస్తున్న బోడసకుర్రుపాలెం మహిళలు

## మహోత్సవాలకు ఏర్పాట్ల పరిశీలన

**అమలాపురం రూరల్:** మండలంలోని పేరూరు గ్రామం తోటపాలెంలో 22వ తేదీ బుధవారం జరిగే ఆదివిజయ భేతాళ స్వామి వారి మహోత్సవాల బందోబస్తు ఏర్పాట్లను డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ముందుగా భేతాళ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పట్టణ సీఐ టి.క్రాంతికుమార్, నిర్వహణ కమిటీ పెద్దలు గోసంగి సత్యనారాయణమూర్తి, సత్తిబాబుతో కలిసి గ్రామంలో కలియతిరిగారు. ఈ సందర్భంగా డీఎస్పీ అంబికాప్రసాద్ మాట్లాడుతూ మహోత్సవాలను అందరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. అశ్లీల డాన్సులు, జూద క్రీడలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.



పేరూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

## వేంకటేశ్వరస్వామికి శ్రవణా నక్షత్ర పూజలు



పుష్పాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి

**అల్లవరం:** మండలంలోని బెండమూర్లంకలో బంగారు తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని ఆదివారం శ్రవణా నక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొమ్మూరి సత్తిబాబు దంపతులచే పూర్ణాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామిని పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

**వేంకటేశ్వరునికి విశేష పూజలు**

**ఉప్పలగుప్తం:** శ్రవణా నక్షత్రం సందర్భంగా మండల పరిధి భీమనపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకాలు, తులసి పూజ జరిపారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ సన్నిధిలో అన్నసమారాధన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### నేడు విద్యుత్‌కు అంతరాయం

**ఐ.పోలవరం:** గుత్తినదీవిలో విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్ నిర్మాణ పనుల నిమిత్తం సోమవారం మండలంలోని మురమళ్ల, కొమరగిరి, ఎదుర్లంక, కరవాకలంక ఆక్వా మరియు గృహ వినియోగదారులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖాధికారి మెకా రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

### వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్ప స్వామి పడిపూజలో పాల్గొన్న మాలధారులు

**యానాం:** స్థానిక ఫెర్రీ రహదారిలో వాసిరెడ్డి సుబ్బారావు స్వగృహం వద్ద ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో హాజరై విశేష పూజలు చేశారు. అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామిని స్మరిస్తూ భజన కీర్తనలు ఆలపించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

### స్వాములకు అన్నదానం

**తాళ్లరేవు:** మండలంలోని సుంకరపాలెం శివాలయం వద్ద శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో సుమారు 300 మంది అయ్యప్ప స్వాములకు వైఎస్సార్ సీపీ ఉప్పంగల గ్రామ కమిటీ అధ్యక్షుడు, లచ్చిపాలెం సొసైటీ అధ్యక్షుడు దవులూరి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి మల్లిపూడి చంద్రరావు, స్వాములు నందికోళ్ల సతీష్, సుంకర బద్రి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### జనవరి 1 నుంచి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

**యానాం:** పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న యానాం, కారైకల్, మాహే, పుదుచ్చేరిల్లోని నాలుగు రీజియన్లలో ఉన్న 30 వేల మంది ఉద్యోగులకు జనవరి 1వ తేదీ నుంచి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ ఆదివారం ఆదేశాలు జారీచేశారు. చాలా మంది ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన పాటించడం లేదని తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇప్పటికే డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ ఉద్యోగులను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసిందన్నారు.

### వన సమారాధన ఆహ్వాన పత్రికల విడుదల

**అమలాపురం టౌన్:** జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రథమ కార్తిక వన సమారాధన ఆహ్వాన పత్రాలను ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ఆదివారం ఉదయం స్థానిక విద్యుత్ నగర్‌లో ఆవిష్కరించారు. డిసెంబర్ 3వ తేదీన అమలాపురం పట్టణ శివారు కొంకాపల్లి సత్తెమ్మ గుడి ప్రాంగణంలో వనసమారాధన నిర్వహించనున్నట్లుగా తెలిపారు. బీసీ ఉద్యోగులంతా ఆత్మీయ వాతావరణంలో సహ పంక్తి భోజనాలతో ఐక్యతను చాటుదామని పిలుపునిచ్చారు.

### 101 మద్యం బాటిళ్ల స్వాధీనం

**అమలాపురం టౌన్:** అక్రమ మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 101 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని నారాయణపేటలో మోటారు సైకిల్‌పై అక్రమ మద్యాన్ని తరలించి విక్రయిస్తున్నారన్న సమాచారంతో సీఐ టి.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై బి.ప్రభాకరరావు నిందితులు ఇద్దర్ని అదుపులోకి తీసుకుని విచారించారు. నారాయణపేటకు చెందిన చిట్టూరి నాగరాజు, అమలాపురం బండివారిపేటకు చెందిన తిరుగుళ్ల రాహుల్‌ను శనివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి మొత్తం ఏడు రకాల 101 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండు విధించారు. నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

### ప్రొటోకాల్ పాటించలేదు

**అల్లవరం:** మండలంలోని గోడితిప్ప పంచాయతీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభంలో సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి ప్రొటోకాల్ పాటించలేదని వైస్ ఎంపీపీ వడ్డి గంగ ఆరోపించారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పనులు ప్రారంభించేటప్పుడు స్థానిక ఎంపీటీసీకి సమాచారం ఇవ్వలేదన్నారు. గోడితిప్ప గ్రామాభివృద్ధి కోసం ఎంపీ అనురాధ నిధులు మంజూరు చేస్తే కనీసం ఎంపీకి సమాచారం ఇవ్వకుండా సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి శంకుస్థాపన చేయమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా సర్పంచ్ శ్రీదేవి అయితే ఆమె భర్త శ్రీనివాస్ పంచాయతీలో పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు.

### కంటి చూపును కాపాడుకోవాలి

**అమలాపురం రూరల్:** ప్రతిఒక్కరూ కంటి చూపును కాపాడుకోవాలని కోనసీమ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి సూచించారు. పేరూరు బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన అకిరా కంటి ఆసుపత్రిని ఆదివారం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి, ఐఎంఏ కార్యదర్శి కంటి వైద్యుడు కడలి ప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ అన్ని అవయవాల్లో కళ్లు ఎంతో ముఖ్యమైనవన్నారు. కోనసీమలో ఇటీవల కాలంలో కంటి సమస్యలు ఎక్కువ కనిపిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అకిరా కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ఎస్.ప్రభాకరరావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నీలిమ, సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.